www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 28 ఫిబ్రవరి 2025
5
అన్నమయ్య





ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ వద్ద పోసాని కృష్ణ మురళి

ఆశల బడ్జెట్



- 'పయ్యావుల'పైనే భరోసా
- 'ఉక్కు' పరిశ్రమకు ఊతమిచ్చేనా
- రూ.3,622 కోట్లతో ఇరిగేషన్ ప్రతిపాదనలు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్‌పై ఆశలన్నీ నిలిచాయి. 2025-26 వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. జిల్లాలోని సాగునీటి పారుదల ప్రాజెక్టులు, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల కేటాయింపులపై అందరి దృష్టి నిలిచింది. మూడేళ్ల కింద నుంచి పారిశ్రామికానికి మౌలిక వసతుల కల్పనలో కదలిక వచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో కల్పించని పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా జిల్లా పారిశ్రామిక ప్రగతి నత్తనడకన సాగుతోంది. జిల్లా నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ యంత్రాంగం ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని 37 సాగునీటి ప్రాజెక్టుల్లో తొమ్మిది ప్రాజెక్టులకు రూ.3,622.88 కోట్లతో ప్రతి పాదనలు పంపించింది. రాయలసీమ మిటిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 ప్యాకేజీ పనులు, కుందూ-పెన్నా, కాలేటివాగు ఎత్తిపోతలు, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ, రాజోలు, జొలదరాశి, యురేనియం బాధిత గ్రామాలకు తాగు నీటి సరఫరా ప్రాజెక్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామనే హామీ నేపథ్యంలో 2018 ఫిబ్రవరిలో జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండల పరిధిలోని కంబాలకుంటలో శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అనంతరం 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసిపి ఉక్కు పరిశ్రమను మూడేళ్లలో ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చని సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు జిల్లా ప్రజానీకం పట్టం కట్టింది. ఈ అవకాశాన్ని కూటమి నాయకత్వం అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ప్రభుత్వం జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనుల్ని రివర్స్ టెండరింగ్ పేరుతో నిలిపివేసిన విషయం తెలిసిందే. అనంతరం ప్యాకేజీ-1, ప్యాకేజీ-2 ప్యాకేజీ-3 పనులకు టెండర్లు నిర్వహించడం మినహా మిగిలిన ప్యాకేజీ-4, ప్యాకేజీ-5, ప్యాకేజీ-6, ప్యాకేజీ-7 పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయింది. రూ.1357 కోట్లతో రాజోలి, రూ.1312 కోట్లతో జొలదరాశి, రూ.564 కోట్లతో కుందూ-పెన్నా ఎత్తిపోతల, రూ.5 వేల కోట్లతో కాలేటివాగు ఎత్తిపోతల పథకం భూసేకరణ అడ్డంకుల కారణంగా ముందుకు సాగడం లేదు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యురేనియం బాధిత గ్రామాలకు తాగునీటి పైప్‌లైన్, కొప్పర్తి పైప్‌లైన్ల పనులు సాకా రానికి నోచుకోలేదు. జిల్లా వ్యాప్తంగా గండికోట, సోమశిల, పైడిపాలెం నిర్వాసితులను గాలికి వదిలేసింది. గండికోట నిర్వాసితులకు పెంచిన పరిహారం ఎప్పటికి అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తెలుగుగంగ, చిత్రావతి, సర్వరాయసాగర్ రిజర్వాయర్ల లీకేజీ పనులు దశాబ్దాల తరబడి నిరీక్షిస్తుండడం తెలిసిందే. తెలుగుగంగ ఇంజనీరింగ్ యంత్రాంగం తాజాగా రూ.90 కోట్ల మేరకు ప్రతిపాదనలు పంపించింది. తాజా బడ్జెట్‌లో సాగునీటి, పారిశ్రామిక ప్రాజెక్టులైన జిఎన్ఎస్ఎస్ ఫేజ్-2, అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్దరణ, కడప ఉక్కు పరిశ్రమ, రాయలసీమ ఎలక్ట్రికల్ మాన్యుఫక్చరింగ్ హబ్‌గా మార్చడానికి సంబంధించిన కేటాయింపులు ఏమేరకు ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

ఓబుళవారిపల్లెలో ఉద్రిక్తత

- పిఎస్ వద్ద వైసిపి శ్రేణులను అడ్డుకున్న పోలీసులు
- న్యాయవాదులనూ అనుమతించలేదు
- పోసానిని 9 గంటలు విచారించిన ఎస్‌పి
- రైల్వేకోడూరు కోర్టులో హాజరుపర్చిన పోలీసులు
- పోలీసు స్టేషన్‌లోనే పోసానికి వైద్య పరీక్షలు
- ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవన్న వైద్యుడు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు/పుల్లంపేట

వైసిపి నేత, సినీనటుడు పోసాని కృష్ణ మురళిని పోలీసులు అన్నమయ్య జిల్లా ఓబుల వారిపల్లె పోలీసుస్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం తర్వాత తీసుకొచ్చారు. హైదరాబాద్‌లోని రాయ దుర్గంలో మై హోమ్ భూజా అపార్ట్‌మెంట్‌లో అదుపులోకి తీసుకున్న తర్వాత నేరుగా ఓబుల వారిపల్లెకు తీసుకొచ్చారు. ముందుగానే విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు, పార్టీ శ్రేణులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఓబువారిపల్లె పిఎస్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. పోసానిని కలుస్తామని వైసిపి నాయకులు పట్టుపట్టడంతో పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్తత పరిస్థితి చోటు చేసుకుంది. పోసాని తరపున వచ్చిన న్యాయవాదులను సైతం అనుమతించలేదు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పోసానిని అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు విచారించారు. 9 గంటల పాటు విచారించారు. పోలీసులకు పోసాని ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, మౌనంగా కూర్చున్నారని పోలీసులు చెబుతున్నారు. విచారణకు సహకరించట్లేదని చెబుతున్నారు. పోసాని నోరుమెదిపితేనే విచారణ ముందుకు సాగుతుందని అంటున్నారు. పోలీసులు ఏప్రశ్న అడిగినా తెలియదు, గుర్తులేదు, అవునా అంటూ సమాధానాలు దాటవేస్తున్నారు. మీడియా సమావేశాల్లో మాట్లాడిన వీడియోలు ముందు పెట్టి ప్రశ్నించినా.. లవ్ యు రాజా అంటూ తనదైన శైలిలో పోసాని ప్రవరిస్తున్నాడని పోలీసులు చెబుతున్నారు. మధ్యాహ్నం నుంచి ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ వద్ద హైడ్రామా చోటు చేసుకుంది. సాయంత్రం రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరుపరుస్తున్నామనే ప్రచారం జరిగింది. పోలీసుస్టేషన్‌లోనే ఆయనను కలిసేందుకు వచ్చిన పోసాని తరపు న్యాయ వాదులను పిఎస్‌లోకి అనుమతించలేదు. కోర్టుకు హాజరుపర్చితే కృష్ణ మురళి తరపున వాదనలు వినించేందుకు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి రైల్వేకోడూరులోనే ఉన్నారు. పిఎస్‌లో పోసానిని కలిసేందుకు అనుమతి ఇవ్వకుండా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆయన తరపు న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో హైకోర్టులో రిట్ పిటిషనల్ వేస్తామని వైసిపి నాయకులు, న్యాయవాదులు పేర్కొంటున్నారు. పోలీసుస్టేషన్‌లోనే ప్రభుత్వ వైద్యుడు గురుమహేశ్ ఆధ్వర్యంలో పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అతనికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. పోలీసు విచారణకు ఆరోగ్య సమస్యలు ఎదురుకావని పేర్కొన్నారు. కాగా ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పోసాని అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన నేత జోగినేని మణి రెండు రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఓబులవారిపల్లె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వర్గాల మధ్య విభేదాలు రెచ్చగొట్టడం, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం, వ్యవస్థీకృత నేరానికి పాల్పడడం వంటి అభియోగాలపై బిఎన్ఎస్‌లోని 196, 353(2), 111 రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కేసు నమోదైంది. రాత్రి 9.45 గంటలకు రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరుపర్చారు.

రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోంది : వైసిపి

రైల్వేకోడూరు : రాష్ట్రంలో అరాచక ప్రభుత్వం రాజ్యమేలుతోందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లో నటుడు పోసాని కృష్ణ మురళిని కలిసేందుకు వద్దకు వెళ్తిన కొరముట్లను పోలీసులు అనుమతించలేదు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోసాని కొన్ని నెలల క్రితమే రాజకీయాల నుండి తప్పుకుంటున్నట్టు ప్రకటించారన్నారు. పోసానికి ఏదైనా హానిజరిగితే ప్రభుత్వాన్నిదే బాధ్యతని తెలిపారు. పోలీసులు చట్టాన్ని అతిక్రమించి అక్రమంగా వ్యవహరిస్తే న్యాయపరమైన ఇబ్బందులకు వెళ్లాల్సి వస్తుందని, ఎవరిని విడిచి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. **రాయచోటి:** రాష్ట్రంలో అరాచకం కట్టలు తెంచుకొంటోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నియంత పాలన చేస్తున్నారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం కక్షలతో రాజకీయ ప్రత్యర్థులను, కళాకారులను, విశ్లేషకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. పోసాని అరెస్టుతో చంద్రబాబు నాయుడి కక్ష రాజకీయాలు పతాక స్థాయికి చేరాయన్నారు. ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి పోలీస్ అధికారులు బలి పశువులు కావద్దని హితవు పలికారు. **మదనపల్లె అర్బన్ :** పోసాని కృష్ణమురళీని అక్రమంగా అరెస్టు చేశారని వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ పేర్కొన్నారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. కక్షపూరితంగా వ్యవ హరిస్తూ వైసిపి మద్దతు దారులపై అన్యాయంగా కేసులు పెడుతూ వేధిస్తోందన్నారు. సిఎం చంద్రబాబు నియంతలా వ్యవహ రిస్తున్నారని ధ్వజమెత్తారు.



ఎఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్: రెవెన్యూ అధికారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం సిపిఎం ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఎఒ శ్రీనివాసులుకు సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, ట్రెజరర్ హరిశర్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ వినతి పత్రం అందించారు. బసినికొండ పంచాయతీలో కబ్జా అయిన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు వెళ్లిన ఆర్ఐ శేషాద్రిరావు, విఆర్ఒ ప్రసాద్‌పై చలపతి అనే వ్యక్తి, అతని అనుచరులు విచక్షణా రహితంగా దాడి చేయడం హేయనీమని ఎఒకు వివరించారు. ఈ సంఘటన తీరును బట్టి చూస్తే అధికారులకు రక్షణ లేకుండా పోయిందని, వారిలో అభద్రత ఏర్పడేలా చేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, దాడి చేసినా వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని కోరారు. మండల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను బహిర్గతం చేయాలన్నారు. ఆ భూ ముల్లో నోటీసు బోర్డులు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, కబ్జా దారులకు వత్తాసు పలికే రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సైన్స్‌డేను విజయవంతం చేయండి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జిల్లాస్థాయి జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు డిఇఒ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. 'వికసిత్ భారత్ కోసం సైన్స్, ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వం కోసం భారతీయ యువతకు సాధికారత' అనే అంశంపై క్విజ్ , సెమినార్ నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. ఎలిమెంటరీ స్థాయి (1-8 తరగతులు) విద్యార్థులకు, సెకండరీ (9-10 తరగతులు) విద్యార్థులకు వేర్వేరుగా ఈ పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల నుంచి ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొనేటట్లు సైన్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చొరవచూపాలని చెప్పారు. అన్ని పాఠశాలలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఒక వేడుకలాగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

పొదుపుతోనే ఆర్థిక సాధికారత : జెసి

ప్రజాశక్తి-రాయచోటి : ప్రతి ఒక్కరూ పొదుపును అలవాటు చేసుకుని ఆర్థిక సాధికారత సాధించాలని జెసి ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్‌బిఐ వారి 'ఆర్థిక పొదుపు వారోత్సవాలు 2025' ప్రచార పోస్టర్లను జెసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ప్రతి సంవత్సరమూ ఒక్కొక్క అంశంతో ఈనెల 24 నుంచి ప్రజల్లో అవగాహన కలిగే విధంగా ఆర్థిక వారోత్సవాలు నిర్వహి స్తామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం సమాజంలో మహిళల బహుముఖ పాత్రను పరిగణనలోకి తీసుకుని వారికి ఆర్థిక అక్షరాస్యతకు ప్రాధాన్యత ఇవ్వడం దీని ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పొదుపు చేసే వనిత విజయం సాధిస్తుందని చెప్పారు. ఈ క్రమంలో రిస్క్ డైవర్సిఫికేషన్, బాధ్యతాయుతమైన రుణాలు తీసుకోవడం, మంచి క్రెడిట్ స్కోర్‌ను నిర్వహించడం, గృహ బడ్జెట్ వంటి అంశాలు, గృహిణులు, శ్రామిక మహిళలు, మహిళా వ్యవస్థాపకులపై ప్రత్యేక దృష్టి సారించి అవగాహన కల్పిస్తారన్నారు. మహిళలు ఇంటి ముఖ్య అవసరాలను సరిగా గుర్తించి పొదుపు చేయాలన్నారు. తెలివిగా నడుచుకొని ఆర్థిక క్రమశిక్షణ పాటించాలన్నారు. ప్రతి బ్యాంకులో ఆర్థిక పొదుపు గురించి బ్యాంకుకు వచ్చే ప్రజలకు, మహిళా లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. డబ్బులను అనవసరంగా ఖర్చులు పెట్టకుండా పొదుపు చేయడం, అవసరానికి మాత్రమే ఖర్చు చేయడం, డిజిటల్ చెల్లింపులు అలవాటు చేసుకోవడం, డిజిటల్ చెల్లింపుల సందర్భంగా మోసపోకుండా అప్రమత్తతతో వ్యవహరించడం తదితర అంశాలలో అవగాహన కల్పించడంతోపాటు పోటీలు నిర్వహిస్తారని చెప్పారు. వీటన్నిటిపై ప్రజలు, ముఖ్యంగా మహిళలు అవగాహన కల్పించుకుని ఆర్థిక సాధికారతను సాధించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదనరావు, ఎల్‌డిఎం ఆంజనేయులు, సహాయమేనేజర్ వన్నూరుబాషా పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెసి ఆదర్శ్ రాజేందర్

నాటుసారా రహిత జిల్లాకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

అన్నమయ్య జిల్లాను నాటుసారా రహితంగా రూపొందించేందుకు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎక్సైజ్ ప్రొహిబిషన్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నాటు సారా నిర్మూలనలో భాగంగా కలెక్టర్ అధ్యక్షతన 'నవోదయం 2.0' జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాటు సారాపై ప్రజల్లో అవగాహన కలిగించి పూర్తిగా నిర్మూలించడానికి ఈ నెల 19న ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ మేరకు నాటుసారా అమ్ముట, తయారు చేయుట, రవాణా చేయుట, కలిగి ఉండుట చట్టరీత్యా నేరం అన్నారు. ఇందుకు 8 సంవత్సరాలు జైలు శిక్షతోపాటు రూ. 5 లక్షల వరకు జరిమానా ఉంటుందన్నారు. జిల్లాలో ముఖ్యంగా 19 మండలాలలో నాటు సారా తయారు చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయన్నారు. ఏ కేటగిరిలో ఆరు గ్రామాలు, బి, సి కేటగిరీలలో 32 చొప్పున గ్రామాలు ఉన్నట్లు ఎక్సైజ్ శాఖ వారు గుర్తించారన్నారు. ఈ 19 మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి నాటు సారా రహితంగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. నవోదయం 2.0 కార్యక్రమ విషయాన్ని ప్రజల్లో విస్తృతంగా వ్యాప్తి చేయాలన్నారు. నాటు సారాయి వల్ల కలిగే దుష్ప్రభావాలను గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో విస్తృతంగా ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఐదు భాగాలుగా విభజించి తీసుకోవాల్సిన చర్యలపై మార్గదర్శకాలు జారీ చేసింది అన్నారు. మొదటి దశలో ఏ, బి కేటగిరీలోని గ్రామాలను క్షేత్రస్థాయిలో సందర్శించి గ్రామసభలు నిర్వహించి నాటు సారా తయారు చేయడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలి. ప్రతి గ్రామంలో ఎస్‌హెచ్ఒ తహశీల్దార్ సచివాలయ సిబ్బంది, విఐఆర్ఒలు గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. నిరంతరం నాటు సారా వృత్తి నుంచి బయటికి రాని వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆ వృత్తిలో ఉన్నవారు బయటికి వచ్చేలా కళాజాత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బెల్లం వ్యాపారులతో సమావేశం నిర్వహించి నాటుసార తయారు చేసే వారికి బెల్లం అమ్మకాలు కొనసాగించకుండా అవగాహన పెంచాలన్నారు. అన్ని శాఖలు నిరంతరం పర్యవేక్షణ చేస్తేనే ఇది సాధ్యం అవుతుందని, ఆ మేరకు అధికారులందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలలో తగు సూచనలు జారీ చేశారు.అంతకు ముందుగా నవోదయం 2.0 కార్యక్రమ అమలుపై ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జి.మధుసూదన్, సహాయ సూపరింటెండెంట్ వై.జోగేంద్ర, ఎల్‌డిఎం, డిఆర్‌డిఎ, పరిశ్రమలు, పంచాయతీ, అటవీ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, తహశీలార్లు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన క్రైస్తవులు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం ఎమ్మెల్యే స్వగృహంలో టిడిపి క్రిస్టియన్ సెల్ నాయకులు, పార్టీ నాయకులు బోనాసి జాన్ బాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషాను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవులా అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. సబ్సిడీ రుణాలను అర్హులు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని సూచించారు. బోనాసి జాన్ బాబు మాట్లాడుతూ క్రైస్తవ సబ్సిడీ రుణాలు మంజూరుకు సంపూర్ణ సహాయ, సహకారాలు అందించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. మదనపల్లిలో క్రైస్తవులకు సమాధుల తోటకు స్థలం ఏర్పాట్లు చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మధు, మద నపల్లి టిడిపి క్రిస్టియన్ సెల్ ప్రెసిడెంట్ రాజేష్, పాస్టర్ దేవమణి, దివాకర్, జీవరత్నం, వై.జీవరాజు, ద్రాక్షావల్లి, సిస్టర్ శోభ నిర్మలకృప, శాంతమ్మ, ప్రేమమ్మ, అలీసమ్మ, సుకన్య, శాంతి కుమారి, ప్రమీల రేచల్, పాల్గొన్నారు.

'ఆదిత్య'లో రెండు రోజుల వర్క్‌షాప్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి సమీపంలోని పుంగనూరు రోడ్డులో గల ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ద ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ పాత్రపై వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు. ఈ శిక్షణా తరగతులు గురు, శుక్రవారాలలో రెండురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరం ఇసిఇ ,చదువుతున్న విద్యార్థులకు రెండు రోజుల పాటు ఐఐసి, ఐఇటిఈఇ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు అన్ని ఆటోమేటివ్ ఎలక్ట్రానిక్ పరికరాలలో కావలసిన విధులను నిర్వహించడానికి ఉపయోగిస్తారని అన్నారు. వాటి వల్ల ఎలక్ట్రానిక్ వస్తువుల పరిమాణం తగ్గి వాటి పనితనాన్ని పెంచుతుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. కె.సతీష్‌బాబు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ వరప్రసాద్ , అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

'మిట్స్' విద్యార్థులకు వృత్తి శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సహకారంతో ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీపై ఆరు రోజుల పాటు ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎన్ఐటిటిఆర్ ప్రొఫెసర్ హెడ్, రిసోర్స్ పర్సన్ డాక్టర్ పి.మల్లిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో పరిశ్రమ ధోరణులు, విద్య, పరిశోధన, పరిశ్రమ అనువర్తనాలు, వాటి ప్రభావంపై వివరించారు. విద్య, ఆరోగ్య సంరక్షణ, గేమింగ్, ఇంజినీరింగ్ వంటి రంగాలను వేగంగా మారుస్తున్న ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ గురించి అవగాహన కల్పించారు. టెక్నాలజీ పరిశ్రమలను వేగంగా మారుస్తున్న తరుణంలో ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ మనం పనిచేసే విధానం, నేర్చుకునే విధానం, పరస్పర చర్య చేసే విధానంలో విప్లవాత్మక మార్పులు చేసే సామర్థ్యంతో కొత్త సాధనాలుగా ఉద్భవించాయని అన్నారు. జ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఎఆర్, విఆర్ పై ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ రూపొందించబడిందని పేర్కొన్నారు. ఎఆర్, విఆర్ టెక్ పరిశ్రమకే పరిమితం కాలేదని, సర్జికల్ సిమ్యులేషన్ల కోసం, ఆరోగ్య సంరక్షణలో, వర్చువల్ ప్రాపర్టీ టూర్‌ల కోసం, రియల్ ఎస్టేట్, గేమింగ్, స్టోరీ టెల్లింగ్ కోసం వినోదంలో వీటిని స్వీకరించడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లిగ

దౌర్జన్యం అప్రజాస్వామికం : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కృష్ణ, గుంటూరు, గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి కూటమి నాయకులు పిడిఎఫ్ మద్దతు దారులపై దౌర్జన్యం చేయడం, దొంగ ఓట్లకు రిగ్గింగ్‌కు పాల్పడడం అప్రజాస్వామికమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి. హెచ్.చంద్రశేఖర్, ఎ.రామంజులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ. మణి పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాంతి యుతంగా, ప్రజాస్వా మ్యబద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికలను అధికార పార్టీ దుర్వినియోగానికి పాల్పడి పోలీసుల సమక్షంలో పిడిఎఫ్ మద్దతు దారులపై దాడులు చేయడం దారుణమన్నారు. అధికార కూటమి విపరీతంగా డబ్బులు పంచడమేగాక అనేక బూత్‌లలో పిడిఎఫ్ ఏజెంట్లను బయటకు పంపి రిగ్గింగ్‌కు పాల్పడ్డం శోచనీయమని తెలిపారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోని విచారిం చాలన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతో ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల మద్దతు గెలుచుకుంటే అభ్యంతరం లేదన్నారు. ఇటువంటి ఘటనలు పట్ల ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు.

పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ఆదేశాల మేరకు మార్చి 1న అన్నమయ్య జిల్లాలో వందశాతం సామాజిక పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులతో వివిధ అంశాలలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై తగు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 1న వందశాతం పింఛన్ల పంపిణీ సక్రమంగా జరగాలన్నారు. ఉదయం 6 గంటలకు స్వయంగా ప్రతి లబ్ధిదారు ఇంటికి వెళ్లి పింఛన్ ఇవ్వాలని సూచించారు. పింఛనుదార్లు అందుబాటులో ఉండాలని అవగాహన కలిగేలా ముందుగానే టామ్ టామ్ వేయాలని చెప్పారు. 1న ఉదయం 5.30కి పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉండాలని సూచించారు. పింఛను పంపిణీ చేసే సమయంలో లబ్ధిదారు నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయరాదన్నారు.

7లోగా పనులు పూర్తి చేయాలి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ, ఉపాధి హామీ పథకాలలో భాగంగా ఇప్పటికే ప్రగతిలో ఉన్న రహదారులు, ఫారం పాండ్లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, గృహ నిర్మాణాలు ఈనెల 7 లోగా పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా అంశాలలో మండల వారీగా సమీక్షించి, ప్రగతిలో వెనకబడిన వారిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్‌డిఎ, డ్వామా, హౌసింగ్ పీడీలు, పంచాయతీరాజ్ ఎస్ఇ, ఎల్‌డిఎం, ఎంపిడిఒలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేస్తున్న కబడ్డీ కోర్టు

పాఠశాలలో ఆట స్థలాలు నిర్మాణం

ప్రజాశక్తి-గాలివీడు

ప్రధానమంత్రి శ్రీ పథకం కింద రెండు లక్షల రూపాయలతో వ్యయంతో పాఠశాలలో ఆట స్థలాలను ఏర్పాటు చేస్తున్నామని బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహిద్దీన్‌బాషా పేర్కొన్నారు. కబడ్డీ కోర్టు, హ్యాండ్‌బాల్, లాంగ్ జంప్ కోర్టులను చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. పీడీ గంగరాజు పర్యవేక్షణలో ఆట స్థలాలు కొలతల ప్రకారం జరుగుతున్నాయని అన్నారు. రాబోయే రోజుల్లో పాఠశాల మైదానంలో పిల్లలు ఆ డుకోవడానికి కోర్టు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రావీణ్యం పొందుతారని అన్నారు.



జరి మహోత్సవంలో పాల్గొన్న ప్రజలు

వైభవంగా జరి మహోత్సవం

ప్రజాశక్తి-కలకడ

జరి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.గురువారం వేకువ జాము నుంచి కలకడ, గుర్రంకొండ, కె.వి.పల్లి ,రాయచోటి, మదనపల్లి, పీలేరు, కలికిరి వివిధ జిల్లాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జరి మహోత్సవంలో కోలాటాలు, బళ్లారి డప్పుల మధ్య నాట్యాలు, దేవరద్దులు ఊరేగింపుగా వచ్చి జరిలో స్నానాలు ఆచరించి భక్తులు దర్శనమిచ్చి వెళ్లారు. ప్రయాణికుల సౌకర్యార్థం పీలేరు, మదనపల్లి టూ డిపో లకు చెందిన 28 బస్సులను కలకడ నుంచి జరి మహోత్సవం వరకు నడపడం జరిగిందని పీలేరు, మదనపల్లి-2 డిపో మేనేజర్లు నిర్మల, అమరనాథ తెలిపారు.భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సిఐలు, ఎస్ఐలు, ఇద్దరు చొప్పున హెడ్ కానిస్టేబుళ్లు ఏడుగురు, 38మంది పోలీసులు, 12 మంది హోంగార్డులు బందోబస్తు నిర్వహించారు.. ప్రయాణి కుల సౌకర్యార్థం వారికి అన్ని విధాల సహకరించినట్లు కలకడ ,కలికిరి సీఐలు గురునాథ, రెడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి సిబ్బంది సుబ్బరామయ్య, శేఖర్, విపిరెడ్డి, కలకడ, గుర్రంకొండ ఎస్ఐలు రామాంజనేయులు, మధు రామచంద్రుడు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వెండి జల్లెడ బహూకరణ

ప్రజాశక్తి-రామాపురం మండలంలోని హసనాపురం పంచాయతీలో వెలసిన గంగాభవాని సమేత స్వామిమలేశ్వర స్వామి కి అదే పంచాయతీ గొల్లపల్లికు చెందిన కాంట్రాక్టర్లు పప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, పప్పిరెడ్డి అమర్నాథ్‌రెడ్డి కుటుంబ సమేతంగా వెళ్లి గురువారం స్వామిమలేశ్వరస్వామికి వెండి జల్లెడను పూజారి శేషు స్వామికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయానికి రూ. 1.13లక్షలు విలువ చేసే కిలో వెండితో చేసిన జల్లెడను వితరణ చేయడం సంతోషంగా ఉందన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-రామసముద్రం : మండలంలోని జంగాలపల్లె గ్రామానికి చెందిన తిమ్మప్ప ఆధ్వర్యంలో గురువారం శ్రీ వాళీశ్వరస్వామి కొండ ముఖద్వారం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దాదాపు రెండు వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా అన్నదానం కార్యక్రమం ఆనవాయితీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఆలయానికి వెళ్తూ వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని ఆర్.నడింపల్లి పంచాయతీ బల్లసముద్రం గ్రామ సమీపంలోని శ్రీ వాళిశ్వరస్వామి ఆలయానికి వెళుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం, కోలార్ జిల్లా గుండ్లపురం గ్రామానికి చెందిన వెంకటమ్మ(70) మహాశివరాత్రి సం దర్భంగా ఆర్. నడింపల్లి గ్రామం లోని తన కుమార్తె నాగవేణమ్మ ఇంటికి వచ్చింది. గురువారం వాలీశ్వర స్వామి దర్శనార్థం కొండ ఎక్కుతూ ఎండ తీవ్రతతో , ఆయాసం ఎక్కువై అస్వస్థతకు గురై మార్గమధ్యంలో మృతి చెందింది. ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది కొండకు వెళ్లే ప్రధాన మార్గంలో తూతూ మంత్రంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కొండకు వెళ్లే మార్గ మధ్యలో రెండు మూడు చోట్ల వైద్య శిబిరం ఉన్నట్లయితే ఇలాంటి ఘటన జరిగేది కాదని ప్రజలు చెబుతున్నారు.

పై దావాలో వాది మీపైన పై కోర్టునందు తన ప్రోనోటు బాకీ రాబట్టుకొనుటకు సివిల్ దావా దాఖలు చేసికొని ఉన్నాడు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం కోర్టువారు మీకు పలుసార్లు నోటీసులు పంపినా మీకు నోటీసులు ముట్టనందున కోర్టువారు మీ హాజరు నిమిత్తం 04/03/2025వ తేదిన వాయిదా వేసి ఉంటున్నారు.కావున మీరు పై తేదిన పై కోర్టు ఎదుట ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అభ్యంతరములు తెలుపుకోవచ్చును. లేని యెడల దావాను మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

స్థలము :తాడిపత్రి
వాయిదా :04/03/2025

ఎన్.విజయభాస్కర్ రెడ్డి,
ఎ.వి.రమణా రెడ్డి,
ఎన్.నవజీవన్ రెడ్డి,
వాదితరుపు వకీల్లు, తాడిపత్రి.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా, నిరసన

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ గురు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు .కార్మికులకు భద్రత కల్పించాలని, పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు ఆప్కాస్ లోనే కొనసాగించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు, సిఐటియు జిల్లా కోశాధికారి టి.హరింద్రనాథ్‌శర్మ మాట్లాడుతూ కార్పొరేట్లకు ఊడిగం చేసే సిఎం చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో అవుట్ సోర్సింగ్ విధానాలను రద్దుచేసి కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తామని హామీలు ఇచ్చారని అన్నారు. ఎన్నికల తర్వాత కార్పొరేట్లకు ఊడిగం చేయడమే తమ పనిగా పెట్టుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి దాని స్థానంలో ఆప్కాస్ విధానం తీసుకురావడంతో కార్మికులకు కొంతమేర ఉపయోగ పడిందన్నారు. ఆ సమయంలో తమను ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తారని కార్మికులు ఆశ పడ్డారని అది అమలు నోచుకోలేదని అన్నారు. ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దుచేసి తిరిగి కార్మికుల శ్రమను దోచుకోవడానికి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులను దరిని చేర్చాలని ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. ఈ పద్ధతిని కార్మికులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కార్మిక లపై ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు పట్టణాలు వేగంగా విస్తరిస్తున్న క్రమంలో కార్మికులపై పనిభారం పెరుగుతోందని మరింత మంది కార్మికులను పారిశుధ్య విభాగంలో చేర్చించి పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్మికులకు సోపులు, యూని ఫామ్, చెప్పులు, సోపులు, కొబ్బరినూనె, బూట్లు, మాస్కులు ఇవ్వాల్సి ఉన్నా ఇంతవరకు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛభారత్, స్వచ్ఛ బి.కొత్తకోట అనే ప్రకటనలకే పరిమితం కాకుండా వాటిని అమలు చేసే విధంగా నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, కార్మికులందరిని ఐక్యం చేసి ఉద్యమబాట పడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శివకుమార్, ఆవులశ్రీనివాసులు, వెంకటేష్, గోపాల్, రమణ, నరసింహులు, లగుమమ్మ, రమణమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



సిఎంకు పంపేందుకు పోస్టుకార్డులను చూపిస్తున్న పారిశుధ్య కార్మికులు

రజత పతకం సాధించిన కోన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- కలకడ

ఈనెల 21 నుంచి 23 వరకు కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ అండర్-19 బాలుర విభాగంలో చిత్తూరు జిల్లా జట్టు ప్రతిభను కనబరిచి రన్నర్స్‌గా నిలిచి రజతపతకం సాధించారని ప్రధానోపాధ్యాయులు మోడెమ్ చెంగల్ రాయుడు తెలిపారు. పతకం సాధించిన జట్టులో కోనలో చదివే సాయినాథ్, మునిగణేష్ రాయల్, జితేంద్ర సమీం ఖాన్ పాల్గొని కీలక పాత్ర పోషించారని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఆకుల ఝాన్సీరాణి, విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరి, నాగముణి నాయక్, రమేష్‌కుమార్‌రెడ్డి, షౌకత్‌అలీ, గఫర్ ఖాన్, నౌషాద్ బేగం, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన మాలే పెద్దయ్యస్వామి జాతర

-పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

మండలంలోని దేవగుడిపల్లె గ్రామంలోమాలేపెద్దయ్యస్వామి జాతర ఘనంగా నిర్వహించారు. జాతరలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భముగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజులలో ఇలాంటి కార్యక్రమాలు మరిన్నీ నిర్వహిస్తామని చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి మంత్రి ధన్యవాదాలు తెలిపారు.



ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఘనంగా పగలు తిరుణాల

నిమ్మనపల్లె : మండలంలోని శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం పగలు జాతర కోలాహలంగా జరిగింది. జాతర సందర్బంగా నేలమల్లేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జనసేన పార్టీ శ్రీ రామ రామాంజనేయులు, స్థానిక నాయకులతో కలసి నేలమల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. . వేల సంఖ్యలో ప్రజలు పెద్ద ఎత్తున జాతరలో పాల్గొనడంతో క్యూ లైన్లు కిక్కిరిసిపోయాయి. బుధవారం ఆలయ పరిసరాలు మొత్తం జనసంద్రంలా మారిపోయింది. జాతరలోని దుకాణాలు కిటకిటలాడాయి. ఇఒమంజుల, ఉత్సవాల ప్రత్యేక అధికారి రవికుమార్, ఆలయ తాత్కాలి కమిటీ చైర్మన్ మేష రామకృష్ణ, టిడిపి నాయకులు రాజన్న ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాలను పర్యవేక్షించారు. శ్రీ కామేశ్వర కల్యాణం ఆలయ పూజారులు శంకర్ శర్మ, లక్ష్మణస్వామి, తదితరులు వైభవంగా నిర్వహించారు. మదనపల్లె రెండవ డిపో వారు ఆర్‌టిసి సర్వీసులు ఏర్పాటు చేశారు. నిమ్మనపల్లె ఎస్ఐ తిప్పేస్వామి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, మాజీ మండల అధ్యక్షులు రాజన్న, సుధాకర, సర్పంచులు రెడ్డెప్ప, సుబ్రమణ్యం, ఆలయ తాత్కాలిక కమిటీ చైర్మన్ మేష రామకృష్ణ, చిన్నరెడ్డెప్ప పాల్గొన్నారు.

కమనీయం..శివ పార్వతుల కల్యాణం



రాజంపేట: పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ హత్యరాల కామాక్షి త్రేతేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవంగురువారం కమనీబయంగా, అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచనలు మేరకు టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, అన్నమయ్య జిల్లా కాకతీయ సేవా సమితి అధ్యక్షులు గొల్లపూటి శివనారాయణ చౌదరి కుటుంబ సమేతంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కార్యక్రమంలో హత్యరాల మాజీ చైర్మన్ పూల నరసింహులు, మాజీ మండల అధ్యక్షులు కోవూరు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, హత్యరాల గ్రామ కమిటీ అధ్యక్షులు ఈశ్వరయ్య నాయుడు, టిడిపి అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, మైనార్టీ నాయకులు ఎస్.కే కరీం, చుండు సుధీర్, జగదాభి పాండురాజు, కోనంకి మల్లికార్జున, పతకమూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కలికిరిలో భ్రమరాంబిక మల్లికార్జునస్వామి...

కలికిరి: వైభవంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం పూలకొండలో నిర్వహించారు. గుట్ట పాలెం పంచాయతీ కె.బరినేపల్లి పూలకొండలో వెలిసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో, కలికిరి లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివపార్వతులకు వైభవంగా వేద పండితులు కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రెడ్డప్ప నాయనవారు, డాక్టర్ వెంకటస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిముల మనుగడకు ముప్పు

-కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదాగాంధీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మాట్లాడుతున్న దాదా గాంధీ

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిము మైనార్టీల మనుగడకు ముప్పు పొంచి ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ అధ్యక్షులు దాదాగాంధీ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేక సభ నిర్వహించారు. ఈ సభకు కాంగ్రెస్ ప్రముఖులతో పాటు సిపిఐ, సిపిఎం నాయకులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన దాదా గాంధీ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ భావ జాలంతో పాలన సాగిస్తూ ముస్లిం సమాజాన్ని అణగదొక్కాలనే ఉద్దేశంతో ఇటువంటి విధానాలను అవలం బిస్తోందని విమర్శించారు. విభజించు పాలించు విధానంతో ప్రజలను మభ్యపెడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రతో బిజెపి విధానాలను కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ ప్రజలకు వివరించారన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా రాష్ట్ర, దేశ స్థాయి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్.రెడ్డి సాహెబ్ మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఒక స్వతంత్ర సంస్థ అని, ఇందులో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా సవరణ బిల్లులో భాగంగా వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులను నియమించడం ముస్లిం మనోభావాలను దెబ్బతీయడమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ అంశంపై బిజెపి వ్యతిరేక పార్టీలు, ముస్లింలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. అనంతరం దాదా గాంధీ, రెడ్డిసాహెబ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లా బకాష్, ఎస్ఎండి గౌస్, మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కే. బాషా, జిల్లా మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ వలి, రామసముద్రం,నిమ్మనపల్లి మండలాల అధ్యక్షులు ఖాదర్ బాషా, ముబారక్ ఖాన్ సిపిఐ నాయకులు కృష్ణప్ప, మురళి, సాంబశివ, సిపిఎం నాయకులు శ్రీనివాసులు, హరినాథ్ శర్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మీనా కుమారి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకుందాం

ప్రజాశక్తి-పీలేరు



మాట్లాడుతున్న రామకృష్ణ

ఎస్‌సి వర్గీకరణ లక్ష్య సాధనలో ప్రాణాలర్పించిన అమరవీల దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 1వ తేదిన ఎస్‌సి వర్గీకరణ లక్ష్య సాధనకై ప్రాణాలర్పించిన అమరవీరులకు జిల్లా, నియోజకవర్గ, మండల, స్థాయిలో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ విషయాన్ని విద్యార్థులకు, నిరుద్యోగులకు, మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలకు తెలియచేయాలని కోరారు. ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నాయకులందరూ పీలేరు కేంద్రానికి చేరుకొని అమరవీరుల దినోత్సవం విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, పీలేరు మండల ఇంచార్జ్ చరణ్ కుమార్ పాల్గొన్నారు.



కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లిము మైనార్టీలు

దర్గా అభివృద్ధికి రూ.20 లక్షలు మంజూరు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు-మదనపల్లి మార్గంలోని బోదేషావలి దర్గా పరిసరాల అభివృద్ధికి పీలేరు ఎమ్మెల్యే, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి రూ.20 లక్షలు మంజూరు చేశారు. మార్చి 2న పవిత్ర రంజాన్ నెల పర్వదినం ప్రారంభం సందర్భంగా దర్గా ఆవరణంలో చేపట్టిన సిమెంట్ ఫ్లాట్ ఫామ్ నిర్మాణం పనులను గురువారం ముస్లీం మైనార్టీ మత పెద్దలు పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి డాక్టర్ మల్లెలరెడ్డిబాషా, టిడిపి సీనియర్ నాయకులు లడ్డు జాఫర్, అల్లావుద్దీన్, మొహమ్మద్ పీర్, కేజీఎన్ రెడ్డి బాష, రహంతుల్లా, అమీర్, మహబూబ్ సాహెబ్, టిడిపి నాయకులు మౌలా, అతికా షఫీ ఉల్లా, చాంద్ బాష, షౌకత్, నౌలాక్ పాల్గొన్నారు.

వృషభ వాహనంపై ఊరేగిన సిద్ధేశ్వరుడు

ప్రజాశక్తి -కలకడ



వృషభ వాహనంపై పార్వతి పరమేశ్వరులు

మండలంలోని దేవలంపేటలో వెలిసిన శ్రీకామాక్షి సమేత సిద్ధేశ్వం స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా వృషభ వాహనంపై సిద్దే శ్వరుడు సతీస మేతంగా ఊరేగించినట్లు ఆలయ ధర్మకర్త రవీంద్ర శర్మ తెలి పారు. రంగు రంగుల పూలతో విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి బళ్లారి డబ్బులు, కీలుగుర్రాలు, గిరిగి డాన్స్, డీజిల్ మధ్య డాన్సులు చేస్తూ దేవళంపేట, ఎర్రయ్యగారిపల్లి, కలకడ పుర వీధులలో ఊరేగించినట్లు తెలిపారు. కమ్మకుల స్తులకు కేటాయించిన వృషభ వాహనము అంగరంగ వైభవంగా నిర్వహించి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు 'బందెల'కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి బందెల గౌతమ్ కుమార్ వన్నె తెస్తారని విజయ భారతి విద్యాసంస్థ ఛైర్మన్ డాక్టర్ ఎన్ సేతు తెలిపారు. తన దగ్గర చదువుకొన్న విద్యార్థి మదనపల్లి నుంచి బహుజన సమాజ్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా నియామకం కావడంతో గురువారం విజయ భారతి పాఠశాలలో గౌతమ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సేతు మాట్లాడుతూ తన దగ్గర విద్యనభ్యసించిన గౌతమ్ కుమార్ విద్యార్థి దశ నుంచే ఉద్యమాలలో పట్టు సంపాదించుకున్నాడని అన్నారు. మదనపల్లి నుంచి ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా నియామకం కావడం అభినందనీయమన్నారు. పేదలకు అన్యాయం జరిగితే వారికోసం నేనున్నానంటూ ముందుకు వచ్చి పోరాటం చేసిన ఘనత గౌతంకే దక్కిందని అన్నారు. కష్టపడితే విజయం వరిస్తుందనడానికి గౌతమ్ ఒక నిదర్శనమన్నారు. అనంతరం గౌతమ్ కుమార్ మాట్లాడుతూ తమ గురువు సేతు దగ్గర చదుకోవటం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. వారి దగ్గర నేర్చుకున్న క్రమశిక్షణ, అందరినీ కలుపుకుపోయే గుణం ఈ స్థితికి తీసుకు వచ్చిందని అన్నారు. విజయభారతి విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విజయభారతి స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లయ్య కొండకు తగ్గని రద్దీ

- బస్సుల కోసం ఇబ్బందులు పడ్డ ప్రజలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్య కొండకు గురువారం కూడా ప్రజల రద్దీ కొనసాగింది. శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దర్శనానికి ఉదయం నుండి అశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ తరుణంలో మల్లయ్య కొండకు బయలుదేరే మార్గం మధ్యలో ఏనుగు మల్లమ్మ ఆలయానికి మొదటి పూజ చేసుకొని మల్లె కొండకు వెళ్లాలి కానీ బస్సులో నిలపకపోవడంతో భక్తులు బస్సులో నుండి తమ పూజా సామగ్రిని ఆలయం వద్దకు విసిరి వేశారు. కాలినడకన కొండకు వెళ్లే భక్తులు మార్గం మధ్యలో బస్సులు నిలిపిన బస్సులు నిలప కపోవడంతో భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాలినడకన వెళ్లే భక్తులు మార్గం మధ్యలో ఎక్కడైనా బస్సు ఎక్కడానికి ప్రయత్నించిన బస్సులు నిల్పలేదని వాపోయారు. ఈ విషయంపై అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.

క్రైం కార్నర్

బంగారు గొలుసు చోరీ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. ముష్టూరు పంచాయతీ వలసపల్లెకు చెందిన నారాయణరెడ్డి భార్య ఎల్. ఓబులమ్మ మదనపల్లె రోడ్డు లోని మర్రిబండ బస్ స్టాప్ వద్ద ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు మోటార్ సైకిల్ పై వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పారిపోయారు. బంగారం గొలుసు బరువు సుమారు 25 గ్రాములు ఉంటుందని దాదాపుగా రూ.2 లక్షల విలువ అవుతుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు.

తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగింత

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని దేవళంపేటలో శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి అనుసంధానంగా జరుగుతున్న జరి మహోత్సవంలో చిన్నారి తప్పుపోయింది. విషయం తెలుసుకున్న కలకడ సిఐ గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు చిన్నారిని పోలీస్ కంట్రోల్ రూమ్ తరలించి మైకు ద్వారా చేసి తప్పిపోయిన ఆ చిన్నారిని వారి తల్లిదండ్రులకు సురక్షి తంగా చేర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, పోలీసులు రమణనాయక్, రమేష్ పాల్గొన్నారు.

భూ వివాదంలో ఘర్షణ

- పోలీసుల విచారణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

భూవివాదంలో బి.కొత్తకోట మండలం, గుంతవారిపల్లెలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ తలెత్తింది.ఈ ఘర్షణలో ప్రత్యర్థుల చేతిలో రఘునాథ్‌రెడ్డి, పి.అమరావతమ్మ గాయపడ్డారు. వీరికి బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. బి.మల్ రెడ్డి, బి.జనార్ధన్ రెడ్డి, బి.రెడ్డిశేఖర్ రెడ్డి, బి.వెంకటరమణ రెడ్డి, బి.మమత అనే వారు భూమి విషయమై తమపై దాడి చేసి గాయపరిచారని పోలీసులకు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట స్థావరం పై దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ తిప్పే స్వామి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు..ముష్టూరు పంచాయతీ వలసపల్లెకు సమీపంలో ఓ కానుగ చెట్టు కింద వలసపల్లి, గుర్రెడ్డిగారిపల్లికు చెందిన నలుగురు వ్యక్తులు కలిసి పేక ముక్కలతో లోపల బయట అనే పేకాట ఆడుతూ ఉండగా పోలీసులు దాడులు నిర్వహించారు. జూదం ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,600లు నగదును స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.